# హల్లో! రాజమ్మా!!

జంపని రామమోహనరావు

అదిగో - దూరంగా అక్కడ నేలమీద అందమైన ప్రహరీ గోడ మధ్యలో ప్లాస్టిక్ ఇటుకలతో కట్టబడ్డున్న ఖరీదైన మూడంతస్థుల నీలిరంగు మేడ ఉంది చూశారా - ఆ మేడే జగన్నాధరావుగారిది.

"ఐఫెల్ టవర్ కట్టటానికి గిస్టావ్ ఐఫెల్ కష్టపడ్డాడు. ఈ మేడ కట్టటానికి నేనే కష్టపడ్డాను." అంటాడు జగన్నాధరావుగారు. "తాజమహలు నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అని ఒక కవి



రాశాడని ఒకసారి ఎవరో చెప్తే. ఆ పుస్తకం తెప్పించుకుని చదివాడాయన. చదివాక– "ఇలాంటి కవులు అనవసరంగా ఏడిచే వాళ్ళను గురించి రాసి చెడిపోతున్నారు. చక్కగా ఏ "మహాభారత కామధేను"వో రాసి ఉంటే ఇతడీ సరికి ఆస్థానకవి అయ్యుండేవాడు. ప్చ్! ఏం చేద్దాం దేనికైనా జాతకం ఉండాలి" అని వాపోయాడు.

జగన్నాధరావు గారికి ఏడుపన్నా, ఏడిచే వాళ్ళన్నా ఏవగింపు. ఇండియాలో చాలా మంది ఏడిచేవాళ్ళున్నారని ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఇండియాలో తయారైన ఏ వస్తువూ వాడుకోరు. ఆయన ఇంటి కారు దగ్గర్నుంచీ కాల్చే సిగరెట్ వరకూ అన్ని వస్తువులూ ఇంపోర్టెడ్ వే. ఇండియాలోని ఏడుపు చదువులు చదివించి ఏడిపించటం ఇష్టంలేక, చదువుకునేందుకై కొడుకుల్ని ఫారిన్ పంపించాడు.

అలా ఏడుపు మీద ఏవగింపు పెంచుకున్న జగన్నాధరావు గారింట్లోకి ఆ వేళ ఏడుపు ప్రవేశించింది.

ఇండియాలో ధరలు తగ్గాయంటే విడ్డూరంకావచ్చు. కానీ ఎవరో ఇంటిలోకి ఏడుపు ప్రవేశించిందనటంలో విచిత్రమేం లేదు. ఏడుపనేది ప్రతి ఇంటినీ పలుకరిస్తూనే ఉంటుంది. ఇండియాలో అయితే వేరే చెప్పాల్సిన అవసరమే లేదు. ఈ ఏడుపు యొక్క ప్రాబల్య రహస్యాన్ని శోధించటం కోసమే గౌతమబుద్ధుడు పెళ్ళాన్ని, పిల్లడ్ని వొదిలేసి, వాళ్ళని ఘోరున ఏడిపించి, తను తపస్సు చేశాడు

అయితే ఇప్పుడు వచ్చిన ఏడుపు ఎవరో తన్నితే వచ్చిన ఏడుపు కాదు. ఎలక్షన్లలో ఓడిపోతే వచ్చిన ఏడుపు అసలే కాదు. ఆ వచ్చింది ఏడుపుతో నిలువెల్లా నిండిన ఒక ఆకారం. ఆ ఆకారం ఒక స్త్రీమూర్తిది.

ఆ స్త్రీమూర్తి మోము వాడిపోయిన మల్లెపూవులా ఉంది. మేఘాల మాటున చంద్రరేఖలా ఉంది. ఆమె కన్నులు కురుస్తున్న నీటి బుర్రల్లా ఉన్నాయి. కరుగుతున్న మంచు ముద్దల్లా ఉన్నాయి. ఆమె స్థిమితంగా నిలబడలేకపోతుంది. తిన్నగా నడవలేక పోతుంది. శరీరం తుఫానులో పోకచెట్టులా ఊగిపోతుంది. తూగిపోతుంది. మెదడు మంచుగడ్డల మీద పెట్టిన అరచేతిలా మొద్దుబారిపోతుంది. ఆమె ఎందుకో ఉరికే తత్తర పడుతుంది. బిత్తరపోతుంది. తల్లడిల్లుతుంది. ఆమె కలవరపడుతుంది. అగ్గలంగా వణకుతుంది. తూలితూలి నడుస్తుంది.

ఆమె పులులు తరుముకొస్తున్న మేకపిల లాగుంది. కీచకుడికి అందకుండా విరాటుడి సభలోకి పరుగెత్తే సైరంధ్రిలాగుంది. పాపపు భారాన్ని మోయజాలక శ్రీహరితో మొర పెట్టుకోబోతున్న ధరణీమాతలా గుంది.

ఆమె... రాజమ్మ!

రాజమ్మ లోపలకు వస్తూనే. తాను వచ్చే పని సఫలం కావాలని కోటి దేవతలకు మొక్కుకుంది. (అసలు దేవతలు కోటి మంది ఉన్నారా లేరా అన్నది వేరే ప్రశ్న. ఈ ప్రశ్నమీద పరిశోధించటానికి ఒక కమిటీని వేసి, ఫారిన్ పంపొచ్చు. కోటి మంది దేవతలున్నారనే తెలితే వాళ్ళు కుటుంబ నియంత్రణ ఎందుకు పాటించలేదో పరిశోధించటానికి మరో కమిటీని వేయొచ్చు.)

అన్నట్లు జగన్నాధరావుగారు ఎన్నో కమిటీలలో మెంబరు. రాజమ్మ ఆ ఇంటోకి వచ్చేసరికి జగన్నాధరావు ఏదో కమిటీ సమావేశానికి వెళ్ళే ప్రోగ్రాం ఉన్నదని గురువచి తయారయ్యాడు. తీరా తయారయాక సమావేశం జరిగే కమిటీ ఏదో మర్చిపోయాడు. గుర్తు తెచ్చుకునేందుకు



గాను సోఫాలో కూర్చుని, ప్రక్కనే ఉన్న దిన పత్రిక అందుకున్నాడు.

"కుటుంబ భారాన్ని భరించలేక ఒక వ్యక్తి ఆత్మహత్య" అనే ఒకవార్త చదివి–చిరునవ్వు నవ్వాడు జగన్నాధరావు. ఆయన నవ్వింది ఎవ్వరో ఆత్మహత్య చేసుకున్నందుకు కాదు. ఆ వారలో ఆయనకు అర్థం ఉన్నట్లు తోచలేదు. "కుటుంబ భారాన్ని భరించలేక ఎవడో ఆత్మహత్య"–ఏం వార్త ఇది!–భరించ గలిగితే ఆత్మహత్య ఎందుకు చేసుకుంటాడు. భరించలేనప్పుడు ఆత్మహత్య చేసుకోక మరేం చేస్తాడు? ఈ మాత్రం ఎవడికి తెలియదని పేపర్లలో వేయాలి?

ఇలాంటివే ఇంకా కొన్ని వార్తలుంటాయి. "ఆకలిబాధ భరించలేక ఒక తేభ్యంగాడి దుర్మరణం"–పిల్లి, భరించ గలిగితే అసలెందుకు ఛస్తాడు. అసలు ప్రపంచంలో ఆ ఒక్క తేభ్యంగాడు కాకపోతే ఆకలిబాధను హాయిగా భరించ గలిగిన వాళ్ళెవరైనా ఉన్నారా? లేనప్పుడు ఈ వార్తకు అర్థమేమిటి. పోనీ వాడు "తిండి లేక" చచ్చాడు అని అర్థం చేసుకున్నా. తిండిలేకపోతే ఆ తేభ్యంగా డొక్కడు కాకపోతే వేరే ఎవడైతే మాత్రం చావకేం చేస్తాడు. అసలు ఆ లెక్కకొస్తే తిండి నిండుగా, దండిగా ఉన్నవాళ్ళంతా చావకుండా చిరంజీవులుగా ఉంటున్నారా? లేనప్పుడసలు చావుకీ తిండికీ లంకేమిటి." అని జగన్నాధరావుగారు తర్కించుకుంటూ


రాలీ ఫాన్

సేల్సు–సర్వీసు

అసలైన విడి భాగములకు

మెయిన్ డీలరు :

సోనోవిజన్

ఏలూరు రోడ్డు, విజయవాడ-2



డా॥ ఏ.వి.కె.రావ్. B.A. సెక్సు స్పెషలిస్టు



వైద్యవిద్వాన్. వైద్యాచార్య

శాస్త్రప్రయోగం. నరముల బలహీనత. అంగము చిన్నదగుట. శీఘ్రస్ఖలనము. శుక్లనష్టము. సుఖరోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.

రావు క్లినిక్

టి. బి. రోడ్. తెనాలి. ఫోన్ 700.


SUVARNA

ఉండగా ఒక దీనమైన కంఠస్వరం వినిపించింది.

'దొరగారూ!"

తలెత్తి చూశాడు జగన్నాథం. ఎదురుగా పనిమనిషి రాజమ్మ.

"ఏం?"

"నా మావకి పెమాదంగా ఉంది దొరా. మందులు కావాలి."

మందులు నాదగ్గరెక్కడివి? మెయిన్ రోడ్‌లో మెడికల్ షాపుల్లో దొరుకుతాయి"

"అది కాదొరా."

"మరేమిటి?"

"నాకు డబ్బులు కావాలి."

"నాకూ కావాలి డబ్బులు-అవసరం లేని వాడు ప్రపంచంలో ఎవడున్నాడు?"

"ఆయన సావు బతుకుల్లో ఉన్నాడు దొరా." ఆమె కంఠం వణుకుతుంది.

"నేను మాత్రం క్షేమంగా ఉన్నాననేమిటి? నేనూ క్షేమంగా లేను. నువ్వూ క్షేమంగా లేవు ఒక్క క్షణం తర్వాత ఏం జరుగుతుందో ప్రపంచంలో ఎవడికీ తెలీదు."

రాజమ్మకు ఏడుపు భొళ్ళున పొంగుతుంది. హృదయం శిల అయిన భరను చూచి శోకించిన 'కిన్నెరసానిలా' బిట్టు ఘోషిస్తుంది.

"అయ్యన్నీ నాకేం తెల్పుదొరా. ఒక్క వంద రూపాయ లిప్పించండి. మీ కాళ్ళు ట్టుకుంటాను."

"కాళ్ళు పట్టుకునే ప్రతివాడికీ వంద రూపాయిలిస్తే తెల్లవారేసరికి నేను మరో కర్ణుడి కాళ్ళు పట్టుకోవాలి."

రాజమ్మకేం అర్థంకావటం లేదు. ఒక వైపున ఒక నిండుప్రాణం మృత్యువుతో పోరాడుతుంటే. ఒక ముత్తయిదువ పసుపు కుంకుమలకు ముప్పు రాబోతుంటే ఆయన అలా ఎందుకు మాటాడుతున్నాడో ఆమెకు బొత్తిగా తెలియటంలేదు. ఆయన దగ్గర చాకిరీ చేసే దాసీదాని ఆర్తిని ఆయనే ఆలకించకపోతే మరింకెవరు లక్ష్యపెడతారు?

"దొరా తమరికి దణ్ణం పెడతాను దొరా నా మావని రచ్చించండి దొరా." నీళ్ళు నిండిన కన్నుల్తో. మొదుబారుతున్న మెడతో, కలవరపాటు నిండిన కంఠంతో. బిట్టుగా వణకే దేహంతో. అగ్గలంగా పెరిగే శోకంతో అంది.

"ఇంతకు ముందిలాగే మూడుసార్లు


# విటమిన్లు మరియు ఖనిజములు మీ కుటుంబము యొక్క ఆరోగ్యమునకు ఎంతో అవసరము



## వారికి తగినన్ని లభిస్తున్నాయా?

అవి లభించకపోతే, వారికి ప్రతి రోజూ విమ్‌గ్రాన్ బిళ్ళ యివ్వండి. రోజంతా మీ కుటుంబంలోని వారందరినీ ఉత్సాహంగా, శక్తివంతంగా ఉంచేందుకు విటమిన్లు, ఖనిజ పదార్థాలుగల విమ్‌గ్రాన్ వాడండి.

**విమ్‌గ్రాన్®**

వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు

11 విటమిన్లు + 8 ఖనిజ పదార్థములు







SQUIBB®

SARABHAI CHEMICALS LTD.

® ఇ.ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రెజిస్టర్డ్ ట్రేడ్ మార్కుకు చిహ్నం. దీని లైసెన్స్‌దు ఉపయోగదారులు ఎస్‌సిఎల్.

ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది

Shilpi-SC-2A/75 tel



అడిగావు. గుర్తుందా? అడిగినప్పుడల్లా ఇచ్చాను- గుర్తుందా?- ఆ తీసుకున్న బాకీ తీర్చాలంటే నువ్వింకా ఇక్కడ ఆరేళ్లు పనిచేయాలి- గుర్తుందా?- మళ్ళీ ఎలా అడుగుతున్నావు బాకీ?" షైలాక్‌లాగా అన్నాడు జగన్నాధరావు.

"ఏం చేయాలి దొరా?" నిస్సహాయంగా అడిగింది రాజమ్మ.

"నోర్మూసుకుని వెళ్ళిపోవాలి. వెళ్ళిపో ముందు."

రాజమ్మకు ఇల్లు కనిపిస్తుంది. అక్కడ, ఇంటిదగ్గర నిప్పుల ఎసరు పొంగటానికి సిద్ధంగా ఉంది. కత్తుల పందిరి కూలి పడటానికి తయారుగా ఉంది. మృత్యువు తన కౌగిలిని బిగించటానికి పొంచి కూరుంది. ఇక్కడ- ఎదురుగా నరుడు కూర్చుని ఉన్నట్టుగా ఆమెకు అనిపించటం లేదు. గాలీ. నీరూ. అగ్నీ, దేవుడూ, దయ్యం. పంచ భూతాలూ. పంచ కోట్ల ప్రేతాలూ కలసి కూర్చొని తన మీద కుట్ర పన్నుతున్నట్లుంది. "దొరా" అని ఏదో అందామనుకుంది. కానీ మాటలు బయటకు రావటంలేదు. అసలా రెండక్షరాలు కూడా తను అన్నాననుకుంది. కానీ పెదవులు దాటి బయటకు రాలేదు. బుర్రలో ఒక విధమైన అలజడి. ఏదో కల్లోలం. ఏదో ఘోష. తెలియరాని ఒక వెర్రితనం ఉవ్వెత్తుగా లేస్తుంది. ముని శాపం తిని అప్పుడే రాక్షసుడిగా మారిపోతున్న ఇందీవరాక్షుడిలా ఆమెలోనూ విపరీతమైన సంక్షోభం చెలరేగింది

అప్పుడామె రూపం చూసే జగన్నాధరావుగారికి ఎందుకో భయం వేసింది. ఆమె అప్పుడాయనకు దుర్గలా, కాళిలా, చండిలా, చండసింహంలా, ప్రచండంగా ప్రళయ భయంకరంగా అగుపించి కేకపెట్టాడు - "పో! - పొమ్మంటె పోవేం! వెంటనే నాముందునుంచి వెళ్ళిపో- యూ ఫస్ట్ గె.." ఆయన మాటలు పూర్తికాకుండానే "అబ్బా" అని తలపట్టుకుని సోఫాలో పడిపోయాడు.

రాజమ్మ పిచ్చిగా తన ప్రక్కనే ఉన్న ఇనపకుర్చీతో ఆయన తలమీద బలంగా కొట్టింది. పడిపోయిన జగన్నాధంగారి జేబులు తడిమింది. వంద రూపాయల నోట్లు ఉన్నాయి. ఒక్క నోటును చేతిలోకి తీసుకుని వెర్రిగా బయటకు ఉరికింది. ఇంట్లోంచి ఎవరో అరుస్తున్నారు. రాజమ్మ వినిపించుకోకుండా సుడిగాలిలా- సవ్యసాచి బాణంలా దూసుకు వచ్చేసింది.

మనిషి బాధలను ఎంతవరకు సహించగలడో అంతవరకే సహించగలడు. ఆ అవకాశం ఉన్నంతవరకూ మనిషి దేవుడే. కానీ సహించలేనంతగా బాధలు వచ్చాయంటె మనిషి దానవుడౌతాడు. తిరుగుబాటూ. విప్లవాలూ మనిషి ఆఖరుదశ. యుగం మారి మరో యుగం ఆరంభమైనట్లు ఈ ఆఖరుదశ పూర్తికాగానే పుడమిమీద మరో నూత్న ప్రపంచానికి పునాదులు పడతాయి.

మెయిన్ బజారులో మందుల కొట్లోకి వెళ్ళింది రాజమ్మ. బొడ్లోనుంచి "ప్రిస్క్రిప్షన్ చీటీని. చేతిలోని వందరూపాయల కాగితాన్ని కౌంటర్ టేబిల్ మీద పెట్టింది. కౌంటర్లో కూర్చున్న షావుకారు రాజమ్మను కళ్ళజోడు చాటునుండి గమనించాడు.

చెమట పట్టిన నుదురు. భయంతో కదులుతున్న కన్నులు. అదురుతున్న ముక్కు, తొట్రుపడుతున్న దేహం. విడిపోబోతున్న జుట్టుముడి, జారిపోతున్నా గమనించని పమిట. ఆమె ఏదో దొంగతనం చేసి వస్తున్నట్లుగా స్పష్టంగా కనిపిస్తుంది. దొంగతనం చేసినా. కప్పిపుచ్చుకొగల నేర్పుండాలి. ఆ నేర్పు ఉంటే రాజమ్మ కూడా మూడంతస్తుల మేడ కట్టేది.

తల పంకించాడు షావుకారు. వంద రూపాయల నోటును పరిశీలనగా చూశాడు. తనగల్లా పెట్టెలోంచి మరో వంద రూపాయల నోటు తీసి, రెండింటిని పోల్చి చూశాడు,

"అమ్మాయీ! ఎక్కడ తెచ్చావు నీవీ కాగితాన్ని?" అడిగాడు సౌమ్యంగా,

"నాదే.. నాదే దొరా.... ఏటయింది?"

"ఇది దొంగ నోటు. ఇది ఎవరి దగ్గరుంటే వాళ్ళని పోలీసులు పట్టుకుంటారు. ఇలాటి నోట్లు మాదగ్గర కొచ్చినప్పుడు చట్టప్రకారం మేం పోలీసుల్ని పిలవాలి. కూర్చో అలా." అని ఫోన్ చేతిలోకి అందుకున్నాడు.

రాజమ్మకు తల తిరుగుతుంది, బ్రద్దలు కాబోతుంది. ఇంటిదగ్గర మృత్యువు తాండవిస్తోంది. తనకిప్పుడు సంకెళ్ళు పడబోతున్నాయి. తను - మావ - సంకెళ్ళు — సంకెళ్ళు - తను - మావ .. మావ ...చటుక్కున కొట్లోంచి బయట కురికింది.

షావుకారు చిన్నగా నవ్వుకున్నాడు. భక్తితో వందరూపాయల నోటును మార్చి మార్చి కన్నుల కద్దుకుని గల్లాపెట్టెలో భద్రం చేసుకున్నాడు.

* * *

రాజమ్మ ఇంటి కొచ్చేసరికి పిల్లలిద్దరూ మంచానికి రెండు వేపులా కూర్చుని పెద్దగా ఏడుస్తున్నారు. వణుకుతూ, తొట్రుపడుతూ, లోలోపల తల్లడిల్లుతూ మంచం దగ్గర కెళ్ళింది రాజమ్మ. భర్త దేహంమీద చేయి పెట్టింది. దేవుడా!

కేక పెట్టటానికి కూడా ఆమెకు గొంతు పెగల్లేదు. చిన్నగా వెక్కుతూ. తలను భర్త వక్షంమీద పెట్టుకుని గట్టిగా ఘోషించసాగింది.

ఆ సమయంలో ఆమె నెవరో పిలిచినట్లయింది. ఆ దుఃఖంలో ఆమెకా పిలుపు ఆపదలో అనునయించటానికి వచ్చిన ఆత్మబంధువు పిలుపులా అనిపించింది. ఆమె శోకం అగ్గలంగా కట్టలు తెంచుకుంది.

మళ్ళీ పిలుపు వినిపించింది. బరువుగా తలెత్తి చూసింది,

"రాజమ్మా ఎవరిక్కడ?" లాఠీ కర్రతో తలుపుమీద కొడుతూ అడిగాడు సపరివార సమేతంగా వచ్చిన పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు. ★